క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నగరి: పట్టణ పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, పోల్స్ నిర్వహణ నిమిత్తం విద్యుత్ సరఫరాను శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరం బ్రాహ్మణ వీధిలో వెలసి ఉన్న శ్రీషిరిడీ సాయినాథుని ఆలయంలో శనివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు బాలాజీ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం సాయంత్రం 6గంటల నుంచి స్వామివారి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని సాయివ్రతం ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి జరిగే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని సాయిబాబా కృపకు పాత్రులు కాగలరని కోరారు.

ఆకాశ కన్నియమ్మకు విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజు కుప్పం పంచాయతీ కోన చెరువు సమీపంలో వెలసిన ఆకాశ కన్నియమ్మకు శుక్రవారం తమిళనాడులోని అమ్మవారికుప్పం గ్రామస్తులు విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. పాలు, తేనె, నెయ్యి, చందనం, కొబ్బరి నీళ్లతో అమ్మవారిని అభిషేకించారు. మధ్యాహ్నం మహిళలు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం భక్తులు తెచ్చిన వివిధ పుష్పాలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పుత్ర సంతానం లేని మహిళలు సమీపంలో వున్న జీవు మానుకు ఊయలలు కట్టి, ప్రదక్షిణలు చేశారు. వచ్చిన భక్తులకు పంచామృతం, ప్రసాదం పంచి పెట్టారు.

వాహన చట్టాన్ని అధిగమించొద్దు


బహుమతి అందజేస్తున్న డీటీసీ నిరంజన్‌రెడ్డి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వాహన క్రయ, విక్రయాలతోపాటు బండి నడిపే వ్యక్తి కూడా వాహన చట్టాన్ని అధిగమించకూడదని డీటీసీ నిరంజన్‌రెడ్డి అన్నారు. చిత్తూరు నగరం కట్టమంచిలో శుక్రవారం ఓ వాహన షోరూంను ప్రారంభించి వాహన చట్టాలపై అవగాహన కల్పించారు. మార్కెట్‌లోకి ఎలక్ట్రికల్ వాహనాలు వస్తున్నాయన్నారు. వాటి నిర్వహణ విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. వాహన చట్టానికి అనుగుణంగా వ్యవహరించాలని చెప్పారు. అనంతరం వాహన కొనుగోలుదారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు జీవరత్నంరెడ్డి, కార్తికేయన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

24న సంకటహర చతుర్థి పూజలు

కాణిపాకం: ఈనెల 24వ తేదీన కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సంకటహర చతుర్థి పూజలు నిర్వహిస్తున్నట్లు ఈవో వెంకటేశు తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు చతుర్థి పూజలు చేస్తామని తెలిపారు. రాత్రి 7 గంటలకు స్వర్ణ రథోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న భజన గీతాలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం నిర్వహించిన భక్తి భజన, జానపద గీతాల ఆలాపన కార్యక్రమం ఆకట్టుకుంది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు జానపద, భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం ఆలయ అధికారులు, సిబ్బంది వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు.

25న హుండీ లెక్కింపు

కాణిపాకం: ఈ నెల 25వ తేదీన కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీలోని కానుకలను లెక్కిస్తున్నట్లు ఈవో వెంకటేశు తెలిపారు. ఉదయం 7 గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. 20 రోజులకు సంబంధించిన హుండీలోని కానుకలను లెక్కిస్తామని, అధికారులు, సిబ్బంది తప్పక హాజరుకావాలని పేర్కొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం

తవణంపల్లె: గ్రామీణ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జి.గొల్లపల్లెలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆయన 45 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు, గర్భిణులకు పరీక్షలు చేశారు. ప్రభుత్వాస్పత్రులో ప్రసవం తల్లీబిడ్డలకు క్షేమమని గర్భవతులకు సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజామణి, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

దోమకాటుతో జాగ్రత్త



- దోమల వ్యాప్తితో సీజనల్ వ్యాధులు
- వాతావరణ మార్పులతో వ్యాధుల భయం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

విజయపురం: వర్షాకాలం ప్రారంభం కావడంతో వాతావరణంలో మార్పులతోపాటు సీజనల్ వ్యాధులూ వచ్చేస్తాయి. ఇటీవల వారం రోజులుగా అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడుతుండడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. వీధుల్లో ఉండే మురుగు నీరు కారణంగా దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. ఇళ్లలో సైతం తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు. అలాగే ఇంటి పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు రాకుండా ఉంటాయి. వ్యాధులు బారిన పడితే వైద్యుల సలహా తప్పనిసరిగా తీసుకుంటే మంచిది.

వ్యాధులు పెరిగే అవకాశం

ప్రస్తుతం వారం రోజులు చిరు జల్లులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు పడుతున్నాయి. వర్షపు నీరు ఇళ్ల చుట్టూ అక్కడక్కడా నిలిచి దోమలకు నిలయంగా మారింది. ఫలితంగా గ్రామాల్లో అక్కడక్కడ ప్రజలు జలుబు, జ్వరాల బారిన పడుతున్నారు. వర్షాలు జోరుగా పడితే జలుబు, జ్వరం, దగ్గుతో పాటు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వీటికి సబంధించిన లక్షణాలు కనిపిస్తే సమీపంలో ఉన్న వైద్యశాలలో సంప్రదించాలని వైద్యులు కోరుతున్నారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్యుల సలహా తీసుకోవాలి.

తీసుకోవాల్సిన చర్యలు

- ఆహారం, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. మల, మూత్ర విసర్జన అనంతరం చేతులను శుభ్రంగా చేసుకోవాలి.
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- చిన్న పిల్లలకు ఒంటి నిండా దుస్తులు కప్పి ఉంచేలా చర్యలు తీసుకోవాలి.
- పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగిన తర్వాతనే తినాలి.
- ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, డ్రమ్ములు, కొబ్బరి చిప్పలు ఉంచకూడదు.
- ఇంటి పరిసరాలలో ఉన్న నీటిని బయటకు పంపివేయాలి.
- పేడదిబ్బలు గ్రామ సమీపంలో లేకుండా చూడాలి.
- వేడి చేసి చల్లార్చిన నీటిని తీసుకోవాలి.
- రాత్రి పూట దోమ కాటుకు గురికాకుండ దోమ తెరలు వాడాలి.

తగిన జాగ్రత్తలు పాటించాలి

ప్రస్తుతం గ్రామాల్లో వర్షాలు పడుతున్నాయి. ప్రజలంతా తగిన జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉంటున్నారు. వ్యాధి లక్షణాలు ఉంటే వైద్యుల వద్దకు వెళ్లాలి. వైద్య, పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో ఉన్న వాళ్లకి వ్యాధులపై అవగాహన కల్పించాలని చెప్పాం. జలుబు, జ్వరం ఉన్నట్లయితే వెంటనే వైద్యుల సలహా తీసుకోవాలి.
– డాక్టర్ సోమశేఖర్, పీహెచ్‌సీ, విజయపురం

కుష్టు నిర్మూలనే లక్ష్యం


సూరికాపురంలో కుష్టు వ్యాధిపై సర్వే

విజయపురం: కుష్టు వ్యాధిని సకాలంలో గుర్తిస్తే మెరుగైన వైద్యంతో నిర్మూలించవచ్చునని డాక్టర్ సోమశేఖర్ అన్నారు. కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా శుక్రవారం విజయపురం, సూరికాపురం, జగన్నాథపురం, పన్నూరు, జంబాడ తదితర గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చర్మంపై బుడిపెలు, కణితిలు, నరాల తిమ్మిర్లు ఉంటే కుష్టుగా అనుమానించవచ్చన్నారు. అలాగే మందమైన మెరిసే జిడ్డుగల చర్మం, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కను రెప్పలు మూత పడక పోవడం, చేతుల నుంచి వస్తువుల జారి పోవడం, తెలియకుండానే చేతులు, కాళ్లలో బొబ్బలు రావడం, చేతివేళ్లు, కాలి వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం, కాళ్ల చెప్పులు జారిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఇలాంటి వారికి ఉచితంగా చికిత్స చేస్తామన్నారు. చికిత్సలో భాగంగా నెలకు ఒక సారి ఆయా రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సిబ్బంది మందులు అందజేస్తారని పేర్కొన్నారు. సర్వేలో గుర్తించిన రోగులకు సకాలంలో వైద్యం అందించడంతోపాటు ఆ వ్యాధిపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కె.రాజకుమార్, ఏఎన్‌ఎం ప్రభావతి, ఆశ వర్కర్ రేవతి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కార్వేటినగరం: హెల్మెట్ ధారణ ప్రాణానికి రక్షణ అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌ఐ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతోపాటు హెల్మెట్ ధరించడం భారం కాదు.. హెల్మెట్ ధారణ ప్రాణానికి రక్షణ అన్న నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం ఎస్‌ఐ వెంకటక్రిష్ణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో 90 శాతం ద్విచక్రవాహన ప్రమాదాలే ఉంటాయని, హెల్మెట్ ధరించక పోవడంతోనే అనేక మంది వాహన చోదకులు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఇలాంటి నిర్లక్ష్యంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని తెలిపారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెంట్ ధరించి ప్రమాదాల నుంచి తమ ప్రాణాలను కాడుకోవాలని సూచించారు.

రోడ్డు నిబంధనలను ఉల్లంఘించే వారికి భారీగా జరిమాన ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ అధికారి డాక్టర్ ధనుంజయరెడ్డి, అధ్యాపకులు ఎస్.కార్తీక్, విశ్వనాథరెడ్డి, జోగి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు శ్రీకారం



పందిరి గుంజకు పాలాభిషేకం చేస్తున్న మహిళలు, వేడుకగా పందిరి గుంజ ఏర్పాటు కార్యక్రమం

పుత్తూరు: పట్టణంలోని శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజుల స్వామి ఆలయం వద్ద శుక్రవారం పందిరి గుంజను నాటడంతో వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం 6 గంటలకు ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం పందిరి గుంజకు మహిళలు పాలాభిషేకం నిర్వహించి, పసుపు కుంకుమ బొట్లు పెట్టి పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, అర్చక స్వాముల మంత్రోచ్ఛారణ నడుమ పందిరి గుంజను వేడుకగా నాటారు. దీంతో ఆగస్టు 11 నుంచి 28 వరకు 18 రోజులపాటు జరగనున్న ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణకు నాంది పడింది.

జాతీయ రహదారిపై పాము కలకలం


రోడ్డుపై పడివున్న జెర్రిపోతు

నగరి: పట్టణ పరిధిలోని ఓంశక్తి ఆలయం బైపాస్ మలుపు సమీపంలో జాతీయ రహదారిపై ఏడడుగుల జెర్రిపోతు ప్రత్యక్షమైంది. అకస్మాత్తుగా పామును చూసి భయాందోళనకు గురైన వాహనదారులు పక్కకు తప్పుకున్నా ఒక వాహనం దానిపై నుంచి వెళ్లడంతో మృతి చెందింది. ఆవైపు వచ్చే వాహనదారులందరూ వాహనాలు ఆపి పామును చూడడం మొదలుపెట్టారు రోడ్డు పక్కన పొదలు ఎక్కువగా ఉండడంతో వాటి నుంచి పాము వచ్చి ఉంటుందని వారు తెలిపారు.

నిర్దేశిత ధరలకే నిత్యావసరాలు


పుత్తూరులో విక్రయాలు ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసగౌడ్

పుత్తూరు: రైతు బజార్లు, పెద్ద రిటైల్ దుకాణాల్లో నిర్దేశిత ధరల్లో నిత్యావసర వస్తువులు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాసగౌడ్ కాపువీధిలోని ఫుడ్ బాస్కెట్ సూపర్ మార్కెట్, బజారు వీధిలోని కిరణ్ సూపర్ మార్కెట్‌లో నిర్ధారించిన ధరలకు నిత్యావసర వస్తువుల విక్రయాలను ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్టీమ్డ్ రైస్ కేజీ రూ.49, రా రైస్ కేజీ రూ.48, కందిపప్పు కేజీ రూ.160 వంతున విక్రయించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ విష్ణురాజు, ఇన్‌చార్జి ఆర్‌ఐ గురుస్వామి, టీడీపీ నాయకులు జీవరత్నంనాయుడు, ధనపాల్, యుగంధర్, షాపు యజమానులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

నింద్ర: మండలంలోని రైతులు సాగు చేసిన వివిధ పంటలను పంటలను ఈ క్రాప్ నమోదు చేయడం తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి తులసిరాం అన్నారు. శుక్రవారం మండలంలోని చవరంబాకం గ్రామంలో రైతులు సాగు చేసిన వరి, చెరకు పంటల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట సాగు చేసిన వివరాలు, విస్తీర్ణం, రైతు పేరు, పూర్తి వివరాలు ఈ క్రాప్‌లో పొందుపరచాలని అన్నారు. రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సజ్జ సాగుతో లాభాల బాట


నగరి పేటలో సాగులో ఉన్న సజ్జ పంట


కృష్ణారామపురంలో సజ్జపంట


నింద్ర మండలం అగరం పేటలో సజ్జ

- పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- మార్కెట్‌లో గిరాకీ

నగరి: ఆరోగ్యానికి తృణధాన్యాలు ఎంతో మేలు చేస్తాయని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో రోజు రోజుకు తృణధాన్యాల వినియోగం పెరు గుతూ వస్తోంది. సేంద్రియ పద్ధతుల ద్వారా పండించే చిరుధాన్యాలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. గతంలో నియోజకవర్గంలోని మండలాల్లో చిరుధాన్యాల సాగు ఎక్కువగా ఉండేది. రానురాను వాణిజ్య పంటల సాగు ఎక్కువైంది. అయితే గడచిన కొద్ది సంవత్సరాలుగా చిరుధాన్యాల వినియోగం మరలా పెరగడం, మార్కెట్‌లో గిరాకీ కారణంగా ఎక్కువ విస్తీర్ణంలో రాగులు, జొన్నలు, సజ్జలు తదితర పంటలు పండిస్తున్నారు. ప్రస్తుతం సజ్జకు అనుకూలమైన సమయం కావడంతో నియోజకవర్గంలో 160 ఎకరాల్లో సజ్జ పంట సాగవుతోంది.

వాతావరణం అనుకూలం

వాతావరణ పరిస్థితుల్లోని అసమానతలను తట్టుకొనే చిరుధాన్యాల (తృణధాన్యాలు) సాగు ఎంతో మేలు అని నిపుణులు సూచిస్తున్నారు. వర్షాలు లేకపోయినా చిరుధాన్యాలు ఎంతో సులువుగా పండుతాయి. ప్రస్తుతం తేలికపాటి వర్షాలు ఉన్న వాతావరణంలోనే సజ్జల సాగు నియోజకవర్గంలో ఊపందుకుంది. తొలకరి రాగానే తిండి గింజల కోసం విరివిగా సాగయ్యే పంట వరి పంట. వరి పూర్తి పంటకాలం దాదాపు 120 రోజులు. అన్ని రోజుల పాటు ఆహార దినుసుల కోసం ఎదురు చూడనవసరం లేకుండా 90 రోజుల కంటే ముందే చేతికి వచ్చే తృణధాన్యాలను రైతులు పండిస్తున్నారు. ఈ పంటలతో ఆహార కొరత తీరడమే కాకుండా మంచి మార్కెట్ ఉంటుంది. గిట్టుబాటు ధరలు కూడా ఉండడంతో గిరిజన రైతులు లాభాలు పొందుతున్నారు. ఒకప్పుడు ఒడిశా, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో రాగులు, సజ్జలు, జొన్నలు ప్రధాన ఆహారంగా ఉండేవి. ప్రస్తుతం ఆ స్థానాన్ని గోధుమ, మైదా, వరి ఆక్రమించుకుంది. అయితే ప్రస్తుతం మార్కెట్ బాగుండడంతో రాష్ట్రంలో చిరుధాన్యాల సాగు పెరుగుతూ వస్తోంది. వరి, గోధుమ వంటి ప్రధాన పంటలపై పరిశోధనలు పెరుగుతున్నా తృణధాన్యాలపై తగ్గుతున్నాయని పలువురు చెబుతున్నారు. ప్రభుత్వం చిరుధాన్యాల సాగులో ఎక్కువ ఆసక్తి చూపితే మరింత ఎక్కువ విస్తీర్ణంలో రైతులు పండించే అవకాశముంటుంది.

రైతులకు సూచనలు ఇస్తున్నాం

తృణధాన్యాల సాగుపై రైతులకు తరచూ సూచనలు అందిస్తున్నాం. సాగు విస్తీర్ణం పెంచేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రస్తుతం నగరి మండలంలో సజ్జలు 35 ఎకరాల్లో సాగవుతోంది. వరి పంట సాగుతో పోల్చుకుంటే చిరుధాన్యాల సాగు కాలం తక్కువే. మార్కెట్‌లో డిమాండ్ కూడా ఉంది. దీంతో రైతుకు చిరుధాన్యాలు లాభాలు చేకూర్చే పంటే.
– రాఘవేంద్ర యాదవ్, వ్యవసాయ అధికారి, నగరి మండలం

అలరించిన అర్జున తపస్సు


తపస్మాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి


వరపడ్డ మహిళలు

– వేడుకగా ఉత్తర గోగ్రహణం

కార్వేటినగరం: శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవంలో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు భక్తులను ఎంతగానో అలరించింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 1 గంటకు గాజులకండ్రిగ గ్రామస్తులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్జున తపస్సు అందరినీ ఆకట్టుకుంది. అర్జున వేషధారి మెట్టు మెట్టుకు పద్యాలు పాడుతూ తనతో తీసుకెళ్లిన నిమ్మకాయలు, విభూది, పుష్పాలను భక్తుల పైకి విసురుతూ తపస్మాను అధిరోహించాడు. మహిళలు తడిబట్టలతో తపస్సుమాను చుట్టూ అధిక సంఖ్యలో వరపడ్డారు, నిమ్మకాయలు విభూది కోసం యువత భక్తులు ఎగబడ్డారు. అర్జున తపస్సుని తిలకించేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అదే విధంగా ఈశ్వరుని కోసం అర్జునుడు చేసిన తపస్సు ఘట్టాన్ని కళ్లకు కట్టినట్లుగా భాగతారిణి రెడ్డెమ్మ గాత్ర కచేరీ నిర్వహించారు. అంతకు ముందు శివపార్వతులను నంది వాహనంపై ప్రతిష్ఠించి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

ఘనంగా ఊరేగింపు

వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి పురవీధుల్లో స్వామి, అమ్మవారు వైభవంగా ఊరేగారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం పట్టు వస్త్ర సుగంధ పుష్పాలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు.

అదే విధంగా వన్నెరెడ్లు తీసుకొచ్చిన సారెతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టారు. ఉత్తర గోగ్రహణంలో భాగంగా నకుల, సహదేవులు వేషధారులు ఆవుల మళ్లింపు ఘట్టాన్ని కనులకు కట్టినట్లు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పోకల సోమనాథ్, కమిటీ సభ్యులు హరిబాబు, శివప్రకాష్, బాబురెడ్డి, క్రిష్ణయ్యయాదవ్, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మహాభారత ధ్వజారోహణం


అమ్మవారికి పట్టువస్త్రాల ఊరేగింపు


శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

వెదురుకుప్పం: పచ్చికాపల్లంలో వెలసిన శ్రీకృష్ణ, ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామివారి ఆలయంలో మహాభారత ఉత్సవాలకు ధ్వజారోహణం కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పోడిచేను గ్రామానికి చెందిన బండి మోహన్‌రెడ్డి, బండి సుందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు పూజ సామగ్రిని ఊరేగింపుగా తీసుకువచ్చారు. మంగళవాయిద్యాల నడుమ ద్రౌపది అమ్మవారికి పట్టువస్త్రాల ఊరేగింపు సాగింది. వేద పండితులు ముహూర్తం సమయానికి ధ్వజారోహణం చేశారు. ఈ మహాభారత ఉత్సవం పది రోజులపాటు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజూ హరికథా కాలక్షేపం, అన్నదానం, రాత్రి వీధి నాటకం ఉంటాయని పేర్కొన్నారు.

తారస్థాయికి టీడీపీ నాయకుల అరాచకాలు


మండల కన్వీనర్ తులసియాదవ్

పాలసముద్రం: కూటమి అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే టీడీపీ నేతల అరాచకాలు తారస్థాయికి చేరాయని, రాజ్యాంగాన్ని అవమాన పరిచేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తులసియాదవ్ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాజంపేట ఎంపీగా ఎన్నికై న విథున్‌రెడ్డిపై టీడీపీ మూకలు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ దాడిని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దాడులు, హత్యలు ప్రస్తుతం రాష్ట్రంలో ఇవే కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. టీడీపీ నేతల దాడిలో గాయపడిన వారిని పరామర్శించేందుకు పుంగనూరులోని మాజీ ఎంపీ రెడ్డప్ప నివాసానికి వెళ్లిన మిథున్‌రెడ్డిపై టీడీపీ మూకలు రాళ్లదాడికి పాల్పడ్డారన్నారు. ఎంపీ వాహనంపై దాడి చేయడంతో వాహనం ధ్వంసమైందన్నారు. టీడీపీ గూండాలు విచక్షణా రహితంగా దాడులు చేస్తుంటే అడ్డుకోవాల్సిన పోలీసులు సైతం మిన్నకుండిపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలి పెట్టన్నారు. జనం కోసం అంటూ గెలుపొందిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సైతం ఈ దాడులను ఖండించకపోవడం దురదృష్టకరమన్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి


మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదనరెడ్డి

బంగారుపాళెం: మామిడిలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన దిగుబడులు సాధించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం తిమ్మోజుపల్లెలో మామిడి కోత అనంతరం తోటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అత్యధికంగా రైతులు మామిడి తోటలు సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం మామిడి తోటల్లో కోత పూర్తయిందన్నారు. ఈ క్రమంలో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. వైఎస్సార్ విశ్వవిద్యాలయం ఉద్యాన శాఖ శాస్త్రవేత్త రాజశేఖర్ మాట్లాడుతూ మామిడి చెట్ల కొమ్మల కత్తిరింపు వల్ల మెరుగైన ఫలితాలు పొందవచ్చన్నారు. కొమ్మలను కత్తిరించిన వెంటనే పెద్ద కొమ్మల భాగానికి లీటరు నీటిలో 10 గ్రాముల కాపర్ ఆక్సోక్లోరైడ్‌ను కలిపిన ద్రావణాన్ని పూయాలన్నారు. అలాగే లీటరు నీటిలో 3 గ్రాముల కాపర్ ఆక్సోక్లోరైడ్ ద్రావణాన్ని కలిపి చెట్లు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. ఎకరాకు జనుము, జీలుగ విత్తనాలను 12 నుంచి 15 కిలోలు చల్లుకుని 30 రోజుల తరువాత దున్నాలన్నారు. సూక్ష్మధాతువుల నివారణకు లీటరు నీటిలో 5 గ్రాముల జింక్ సల్ఫేట్, 2 గ్రాములు బోరాన్ మందు కలిపి 20 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలని సూచించారు. పొలుసు పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఎంఏపీ పీడీ సుబ్రమణ్యం, ఉద్యానశాఖ అధికారి సాగరిక, రైతు సేవా కేంద్రం సహాయకుడు రాజేంద్రనాయుడు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న సీఐడీ అధికారి పద్మలత

తిరుపతి సిటీ : దేశంలో నూతనంగా అమలులోకి వచ్చిన చట్టాలపై విద్యార్థినులు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరముందని సీఐడీ రిజనల్ అధికారి, డీఎస్పీ పద్మలత సూచించారు. శుక్రవారం నగరంలోని శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పద్మలత మాట్లాడుతూ సమాజంలో ఎదురయ్యే సమస్యలను మహిళలు ధైర్యంగా ఎదుర్కోవాలని కోరారు. చట్టాలపై పూర్తి అవగాహన కలిగినప్పుడే విద్యార్థినులకు మనోధైర్యం వస్తుందని వెల్లడించారు. సామాజిక మాధ్యమాలలో తలెత్తిన పరిణామాలు, వాటి ప్రభావం, ఇటీవల మహిళలపై జరిగిన సంఘటలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ భువనేశ్వరి, సీఐడీ ఎస్‌ఐలు బాబా ఫక్రుద్దీన్, మంజుల, డాక్టర్ స్నేహలత, శారద, విద్యార్థి సమాఖ్య సభ్యులు జయమ్మ పాల్గొన్నారు.

శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో..

ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ ఆధ్వర్యంలో పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలోని విద్యార్థినులకు నూతన చట్టాలపై సీఐడీ అధికారి పద్మలత అవగాహన కల్పించారు.

శుక్రవార ఉత్సవాలు ప్రారంభం


చందన అలంకరణలో అంకాళమ్మ తల్లి

తిరుపతి కల్చరల్ : తిరుపతి పాత రేణిగుంట రోడ్డులో వెలసిన గ్రామదేవత అంకాళమ్మ ఆలయంలో ఆడినెల శుక్రవార మహోత్సవాలు శుక్రవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఏటా ఆడి నెల తొలి శుక్రవారంతో ఆరంభమయ్యే ఈ ఉత్సవాలు ఐదు శుక్రవారాలపాటు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇందులో భాగంగా ఆలయంలో ఉదయం 3 గంటలకు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చందనం అలంకరణలో అమ్మవారిని కొలువుదీర్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ క్రమంలో భక్తులకు పసుపు, కుంకుమ, ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.మమత, ప్రధాన అర్చకుడు డి.మహేష్ పాల్గొన్నారు.